సాక్షి
జగిత్యాల

మంగళవారం । 5 । నవంబర్ । 2024



ఆలయాల్లో కార్తీక సందడి

ధర్మపురి: కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉసిరిక చెట్టు వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.



గోదావరిలో కార్తీక స్నానాలు

ధర్మపురి: కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా ధర్మపురి గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0/21.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉదయం మంచు దట్టంగా కురుస్తుంది. చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

మెట్‌పల్లి నుంచి పామూరు -కనిగిరి బస్సు ప్రారంభం

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పామూరు–కనిగిరికి ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం డిపో మేనేజర్ దేవరాజ్ ప్రారంభించారు. ఈ మార్గంలో నడిచిన బస్ సర్వీస్‌ను ప్రభుత్వం మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించిన తర్వాత బస్సులు సరిపోకపోవడంతో నిలిపివేశారు. ఈ క్రమంలో ఇక్కడ పెద్ద సంఖ్యలో స్థిరపడిన ఆ ప్రాంతానికి చెందిన వారి విజ్ఞప్తి మేరకు తిరిగి బస్ సర్వీసును ప్రారంభించారు. బస్సు ప్రతిరోజు మధ్యాహ్నం 1.20గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరుతుందని డీఎం పేర్కొన్నారు.

జగిత్యాలకు 33 ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరు



డీఎంహెచ్‌వోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గానికి 33 ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరయ్యాయని, 20 ఆరోగ్య ఉపకేంద్ర భవనాలకు నిధులు విడుదలయ్యాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌వోతో సమావేశమయ్యారు. భవన నిర్మాణాల పనులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, వెంటనే ఆరోగ్య ఉపకేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీ అధికారులకు సూచించారు. రాయికల్ మండలం ఇటిక్యాలలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. డీఎంహెచ్‌వో సమియోద్దీన్, ప్రోగ్రాం అధికారి రవీందర్ పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయండి



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

జగిత్యాలటౌన్: రైతులకు రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యవసాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. రాయికల్ మండలం మైతాపూర్‌లోని ఇండియన్ బ్యాంక్, మల్లాపూర్ మండలం మొగిలిపేటలోని కెనరా బ్యాంకులో తాము తీసుకున్న పంట రుణాలు మాఫీ కాలేదంటూ రైతులు ఎమ్మెల్సీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన కమిషనర్‌కు లేఖ రాశారు. పంట రుణాలు రెన్యూవల్ చేసుకున్న రైతులకు రుణమాఫీ కాక ఆందోళన చెందుతున్నారని, ఈ విషయంపై విచారణ చేపట్టి అర్హులైన రైతులకు మాఫీ వర్తింపజేయాలని, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

జగిత్యాలరూరల్: గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో సమస్య పరిష్కారానికి హైదరాబాద్‌లో చేపట్టిన మహాధర్నాకు వెళ్లకుండా మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. జగిత్యాల రూరల్ మండలంలోని మాజీ సర్పంచులు చెరుకు జాన్, ప్రభాకర్, సురకంటి స్వప్న, ప్రవీణ్‌గౌడ్‌ను రూరల్‌ఎస్సై సదాకర్, అర్బన్ మండలానికి చెందిన మాజీ సర్పంచులు గంగాధర్, తిరుపతి, లక్ష్మణ్‌రావును పట్టణపోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

అరెస్ట్‌ను ఖండించిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్

జగిత్యాల: పెండింగ్ బిల్లుల కోసం పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచుల అరెస్ట్‌ను ఖండిస్తున్నామని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. సీఎంను కలిసి వినతిపత్రం ఇస్తామంటే అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. బిల్లులు చెల్లించేందుకు నిధులు లేవంటూనే.. రూ.1.50లక్షల కోట్లతో మూసీ ప్రాజెక్టుకు ఖర్చు చేస్తామంటున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య పడకేసిందని, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు

- చిన్నచిన్న అద్దె గదుల్లో నిర్వహణ
- నిబంధనలూ పట్టని వైనం
- పట్టించుకోని వైద్యాధికారులు



ఇటీవల ఓ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

జగిత్యాల: జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. చిన్నచిన్న గల్లీల్లో చిన్నచిన్న గదుల్లో ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని ఆస్పత్రుల నిర్వాహకులు పాంప్లెంట్ల ద్వారా ఊదరగొడుతున్నారు. ఈ విషయాలన్నీ ఇటీవల వైద్యాధికారులు చేసిన ఆస్పత్రుల తనిఖీల్లో వెలుగుచూశాయి. జిల్లాకేంద్రంతో పాటు, జిల్లాలోని అన్ని ఆస్పత్రులను తనిఖీలు చేస్తుండగా విస్తుపోయే విషయాలు బయటకు వస్తున్నాయి. క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ప్రకారం సక్రమంగా లేకున్నా.. ఒక డాక్టర్ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని.. మరో డాక్టర్ ఉంటే వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 10 ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు.

ఎక్కడపడితే అక్కడ..

జిల్లాలో చిన్నచిన్న గదుల్లో.. ఎక్కపడితే అక్కడ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నా వైద్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఫలితంగా నిర్వాహకులు వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకుంటున్నారు. కార్పొరేట్ వైద్యమని చెబుతూ ఆ స్థాయిలోనే ప్రజల నుంచి ఫీజుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. జిల్లాలో సుమారు 170వరకు ఆస్పత్రులున్నాయి. వీటిలో కనీస నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా రోగులకు సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. డబ్బుల వసూళ్లలో మాత్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా జిల్లా వైద్యశాఖ అధికారులు గాలికొదిలేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో ఇటీవల కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు చిన్న ఇరుకైన గదులను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. మెట్లు లేకపోవడం, రోగులు పైకి వెళ్లడానికి చిన్నచిన్న ర్యాంపులు లేని భవనాల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడే లేడు.

తరచూ మారుతున్న డాక్టర్లు

ఏదైనా ఆస్పత్రిని ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత డాక్టర్ ఎవరు..? ఆస్పత్రి పేరు.. నర్సింగ్‌హోం లేదా జనరల్ ఆస్పత్రి, మల్టీకేర్ వంటి విషయాలను వైద్యశాఖకు తెలపాల్సి ఉంటుంది. కానీ కొందరు వైద్యాన్ని వ్యాపారం చేస్తూ ఎక్కడినుంచో డాక్టర్లను తీసుకొచ్చి ఆస్పత్రులను నెలకొల్పుతున్నారు. ఒకసారి న్యూరోసర్జన్ అని, మరోసారి ఫిజిషియన్ అంటూ ఆస్పత్రిలో డాక్టర్లను మార్చుతున్నారు. ఏదైనా ఆస్పత్రిలో డాక్టర్ మారినప్పుడు వెంటనే వైద్యశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ జిల్లాలో మాత్రం ఇవేమీ పట్టించుకోవడం లేదు.

నిబంధనలు హుష్‌కాకి

జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. నర్సింగ్‌హోంలు, ఐసీయూలు ఉన్నప్పుడు వాటికి సరిపడా బెడ్లు ఉండాలి. ఈ నిబంధనలను ఎవరూ పాటించడం లేదు. దీంతోపాటు ఫైర్‌సేఫ్టీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే మంటలు ఆర్పేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు ఉండాలి. ఆస్పత్రి భవనంపై నిర్ణీత సామర్థ్యం గల నీటి ట్యాంకులతోపాటు దానికి సంబంధించిన వాటర్ పైప్‌లైన్, వార్డులు, గదులకు ఉండాలి. ఈ నిబంధన ఎక్కడా లేవు. ఆస్పత్రి చుట్టూ అగ్నిమాపక యంత్రం తిరిగేలా అనువైన స్థలం ఉండాలి. నర్సింగ్‌హోంలలో ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ ఉండాలి. ఇవేమీ పట్టకుండానే చిన్నచిన్న ఇరుకైన గదుల్లో అద్దెకు తీసుకుని ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి హాస్పిటల్‌లో మెట్లు విశాలంగా ఉండటంతో పాటు ర్యాంపులు కూడా ఉండాలి. రోగులను స్ట్రెచర్‌పై తీసుకెళ్లేందుకు వీలుగా ర్యాంపులుండాలి.

కనిపించని జనరేటర్లు.. పార్కింగ్

కొన్ని ఆస్పత్రులు జనరేటర్లు కూడా ఏర్పాటు చేసుకోవడం లేదు. ఎప్పుడైనా అకస్మాత్తుగా కరెంట్ పోతే జనరేటర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించే అవకాశం ఉంటుంది. కొన్ని ఆస్పత్రులు రోడ్లపైనే జనరేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఏ ఆస్పత్రిలోనూ పార్కింగ్ సౌకర్యం లేదు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్, జంబిగద్దె, గొల్లపల్లి రోడ్, మహాలక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ఆస్పత్రులున్నాయి. ఏ ఆస్పత్రిలోనూ పార్కింగ్ లేక ఇబ్బందిగా మారింది.

కనిపించని బోర్డులు

ప్రతి ఆస్పత్రిలో వైద్యుల వివరాలు.. వారి అర్హతలు.. ఇతర సిబ్బంది వివరాలు.. ఎలాంటి వైద్యం అందుబాటులో ఉంది..? వేటికెంత ఫీజు..? అనేది ప్రదర్శించాలి. కానీ ఇవ్వన్నీ కొన్ని ఆస్పత్రుల్లో మాత్రమే కన్పిస్తాయి. అలాగే ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి వేతన చట్టం ప్రకారం జీతాలు చెల్లించడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై నిర్వాహకులు కార్మిక శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇది మచ్చుకైనా కన్పించడం లేదు. ఆస్పత్రి ఏర్పాటు చేసిన చోట కాలుష్యం ఏ మేరకు ఉంది..? అక్కడ ఏమైనా ఫ్యాక్టరీలున్నాయా..? పరిశీలించాలి. ఫ్యాక్టరీలు లేకపోయినా.. కొన్నిచోట్ల పొల్యూషన్ ఉన్నా నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడం లేదు. కాలుష్య నియంత్రణమండలి నుంచి అనుమతి కూడా తీసుకోవడం లేదు.



అశోక్‌నగర్‌లో అత్యధికంగా వెలసిన ఆస్పత్రులు



జంబిగద్దె ప్రాంతంలో పార్కింగ్ లేకపోవడంతో రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

డాక్టర్లు మారితే మళ్లీ రిజిస్ట్రేషన్



కొత్తగా ఆస్పత్రులు ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత డాక్టర్ ఎవరు..? ఏ ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నారు..? వంటి అంశాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రుల్లో డాక్టర్లు మారితే మళ్లీ అనుమతి తీసుకోవాలి.

– శ్రీనివాస్, క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నోడల్ అధికారి, డెప్యూటీ డీఎంహెచ్‌వో

ఆవేదనల నివేదనలు..

- ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం
- కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి
- బాధితుల నుంచి అర్జీల స్వీకరణ



జగిత్యాలటౌన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. వారి నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 22 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించిన కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవోలు పులి మధుసూదన్‌గౌడ్, శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పనులు చేసిన పాపానికి అరెస్టులా..?



గత ప్రభుత్వం, అధికారుల సూచనల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశాం. ఆ బిల్లులు చెల్లించాలని కోరితే పోలీసులు అరెస్ట్ చేసి ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తున్నారు. పెండింగ్ బిల్లులను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లోపు చెల్లించాలి. పార్టీలతో సంబంధం లేకుండా అప్పు చేసి మరీ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశాం. బిల్లులు రాక ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నం. కొత్త ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలి. తాజామాజీ సర్పంచులు

జాయింట్ ప్యాసేజ్ అంటున్నారు



జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె ప్రాంతంలో పదేళ్ల క్రితం ఇంటిని కొనుగోలు చేశాం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సేల్‌డీడ్ డాక్యుమెంట్‌లో ఇంటికి తూర్పు వైపున్న 7ఫీట్ల దారిని కామన్ ప్యాసేజ్‌గా పేర్కొన్నారు. మాకు ప్రాపర్టీ విక్రయించిన విద్యాసాగర్‌గౌడ్ 2003లో రాజాగౌడ్ వద్ద కొనుగోలు చేసిన డాక్యుమెంట్‌లోనూ ఈ ఏడు ఫీట్ల దారిని కామన్ ప్యాసేజ్‌గానే చూపించారు. 20ఏళ్లుగా ఈ దారిని కాసారపు రాజాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గడ్డం ఉమారాణితోపాటు మేం కూడా నడిచేందుకు వినియోగించుకుంటున్నాం. గడ్డం ఉమారాణి, కాసారపు శ్రీనివాస్‌గౌడ్ నుంచి ఈ ఏడాది ఖాళీస్థలాన్ని కొనుగోలు చేసిన క్యాదాసు నవీన్ తన డాక్యుమెంట్‌లో 7ఫీట్ల దారిని జాయింట్ వేగా చూపిస్తూ మమ్మల్ని ఆ దారిలోకి రావద్దంటున్నాడు. కామన్ ప్యాసేజ్‌ను జాయింట్ ప్యాసేజ్‌గా మార్చి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన గడ్డం ఉమారాణి, శ్రీనివాస్‌గౌడ్, క్యాదాసు నవీన్‌పై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి.

– చిగిరి సత్తవ్వ

ప్రాణభయం ఉంది



మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ శివారు సర్వేనంబర్ 605అ లోని 1.34 ఎకరాల సొంత భూమిలో రూ.4లక్షలు ఖర్చు చేసి కుంట తవ్వుకుని చేపలు పెంచుకుంటున్నాం. జగ్గసాగర్‌కు చెందిన పల్లికొండ ప్రవీణ్ దౌర్జన్యంగా రాత్రివేళ కుంటలో చేపలు కలిపాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసుల ముందే బెదిరింపులకు పాల్పడ్డాడు. చేపల చెరువు వద్దకు వస్తే నన్ను నా భర్తను చంపుతానని బెదిరిస్తున్నాడు. ప్రవీణ్‌తో మాకు ప్రాణభయం ఉంది కాపాడండి. – వై.పద్మ మెట్లచిట్టాపూర్

ఎఫ్‌టీఎల్, బఫర్ కబ్జాను నియంత్రించండి



చింతకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో చెరువు మత్తడి స్థలాన్ని పూడ్చివేస్తూ టేలాలు, షెడ్లు వేసుకుని కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి. మత్తడి ప్రాంతంలో మొరం పోసి షెడ్లు, టేలాలు వేయడంతో రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలోని పలు ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అక్రమార్కుల కబ్జాలను అరికట్టి చింతకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌ను రక్షించండి.

– కుల సంఘాల ప్రతినిధులు

పెన్షన్ ఇప్పించండి



మాకు అన్ని అర్హతలు ఉన్నా.. పెన్షన్ మాత్రం రావడం లేదు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ మాకు మాత్రం న్యాయం చేయడం లేదు. కలెక్టర్ చొరవ తీసుకుని పెన్షన్ ఇప్పించాలి. – హబ్సీపూర్ మహిళలు

వైద్య వృత్తి గొప్పది

- కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్



పాల్గొన్న వైద్య విద్యార్థులు, సిబ్బంది

జగిత్యాల: వైద్య వృత్తి ఎంతో గొప్పదని, వృత్తి గౌరవాన్ని ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. వైద్య కళాశాలలో నూతనంగా చేరిన వైద్య విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. వైద్యులు కా వడం చిన్న విషయం కాదని, ఎంతో కృషి, పట్టుదల ఉంటేగానీ ఇంతదూరం రాలేరని, దీనిని సవాల్‌గా తీసుకుని రాణించి.. వైద్యులుగా మంచి సేవలు అందించాలని పేర్కొన్నారు. ముందుగా మానవత దృక్పథం, విలువలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, ఎక్సలెన్స్ సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఖాద్రీ, సూపరింటెండెంట్ రాములు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది రానీయొద్దు



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రానీయొద్దని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని మైతాపూర్, రామాజీపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. కేంద్రాలకు ధాన్యం ఎంత వస్తోంది..? తేమ ఎంతశాతం ఉందనే అంశాలపై ఏఈవోలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సరిపడా గన్నీ సంచులు ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలన్నారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ఖయ్యూం, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి పాల్గొన్నారు.

బస్సు కోసం మోడల్‌స్కూల్ విద్యార్థుల ధర్నా



కథలాపూర్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

- పాఠశాల సమయానికి నడపాలని డిమాండ్

కథలాపూర్: పాఠశాల సమయానికి బస్సు సర్వీసులు నడిపించాలని డిమాండ్ చేస్తూ కథలాపూర్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థులు కోరుట్ల–వేములవాడ రోడ్డుపై సోమవారం సాయంత్రం ధర్నా చేశారు. మండలంలోని తాండ్రియాల, గంభీర్‌పూర్ గ్రామాల రూట్‌లో పాఠశాలల సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల నుంచి కథలాపూర్ మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావడానికి ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరుతున్నామని, తిరిగి రాత్రి ఏడు గంటలకు మాత్రమే తాండ్రియాల, గంభీర్‌పూర్‌కు బస్సు నడుస్తుండడంతో ఇంటికి వెళ్లేసరికి రాత్రి ఎనిమిది గంటలు అవుతోందని విద్యార్థినులు వాపోయారు. పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం ఉంటే సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటికి చేరుకునే వీలుంటుందని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై నవీన్‌కుమార్ వచ్చి ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

‘అమృత్’ ద్వారా ప్రతీ ఇంటికి నీరు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- ఫేజ్–2 పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: అమృత్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీరందించడమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అమృత్–2 పథకం కింద రూ.147 కోట్లతో కరీంనగర్‌లో చేపట్టనున్న పనులకు ఫిల్టర్‌బెడ్ వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ పథకాన్ని 2015లో ప్రారంభించామన్నారు. అమృత్–1 కింద దేశవ్యాప్తంగా రూ.50 వేల కోట్లు వెచ్చించి, 1.34 కోట్ల నల్లా కనెక్షన్లు, 1.02 కోట్ల డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చామని పేర్కొన్నారు. అమృత్–2లో భాగంగా రూ.2.99 లక్షల కోట్లతో దేశంలోని మున్సిపాలిటీలు, నగరాల్లో ప్రజల దాహార్తిని తీర్చబోతున్నామని తెలిపారు. తెలంగాణకు రెండు ఫేజ్‌లలో రూ.6,876 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి రూ.852.11 కోట్లు ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థలో అమృత్–1 కింద రూ.136.56 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. అమృత్–2లో మొత్తం 159.55 కిలోమీటర్ల మేర పనులు చేసి, మరో 10,500 కుటుంబాలకు నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు. రూ.18 కోట్లతో హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలోని 5 డివిజన్లకు 24 గంటలు నీటి సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ప్రసాద్ స్కీం కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే నూతన చైర్మన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కమలాకర్ మాట్లాడుతూ.. అమృత్–2 పనులు పూర్తయితే విలీన గ్రామాలకు తాగు నీరందించడంతోపాటు, 24/7 నీటి సరఫరా లక్ష్యం నెరవేరుతుందన్నారు. వేదిక పైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులం ఉన్నామని, అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెట్టాలని సూచించారు. మానేరు రివర్ ఫ్రంట్ 60 శాతం పూర్తయిందని, మిగతా 40 శాతం పనులు పూర్తి చేసేందుకు కేంద్ర సహాయమంత్రిగా బండి సంజయ్ నిధులు తీసుకురావాలని కోరారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, కార్పొరేటర్లు, ప్రజారోగ్యశాఖ, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ల బ్యాటరీలు, పట్టీలు చోరీ


బ్యాటరీలు, పట్టీల చోరీకి గురైన ట్రాక్టర్లు

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో 14 ట్రాక్టర్లకు చెందిన హైడ్రాలిక్ పట్టీలు, 5 బ్యాటరీలు చోరీకి గురైనట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. వివిధ రకాల ధాన్యంతో లోడు చేసిన ట్రాక్టర్లను సంబంధిత యజమానులు ఆదివారం గునుకుల కొండాపూర్ నుంచి చీమలకుంటపల్లె గ్రామానికి వెళ్లే రహదారి పక్కన నిలిపి ఉంచారు. సోమవారం ఉదయం చూసే సరికి ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలు, పట్టీలు లేవు. చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యుడు సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మేడిపల్లి(వేములవాడ): గంజాయి విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ యూసఫ్ వ్యసనాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించేందుకు గంజాయి అమ్మడం అలవాటు చేసుకున్నాడు. సోమవారం ఉదయం భీమారం మండలంలో గంజాయి విక్రయించేందుకు వస్తుండగా తనిఖీల్లో భాగంగా మేడిపల్లి మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. సమావేశంలో సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్యాంరాజ్, సిబ్బంది చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


సుధాకర్(ఫైల్)

సిరిసిల్లక్రైం: జీవనోపాధి కోసం చేసిన అప్పులు అధికమవడంతో అవి తీర్చే మార్గం లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాలు.. తంగళ్లపల్లి మండలం కందికట్కూరుకు చెందిన వెలిశాల సుధాక ర్ (40) సిరిసిల్ల పరిధిలోని చందంపేటలో కట్టె కోత మిషన్ నిర్వహిస్తూ 20 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నాడు. వ్యాపార నిమిత్తం బ్యాంకుల్లో చేసిన అప్పుల అధికమవడంతో వాయిదాలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఆరోగ్యం సహకరించకపోవడంతో వ్యా పారం మరింత దెబ్బతిన్నది. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది చంద్రంపేటలో కట్టెకోత మిషన్ షెడ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లత, 8 ఏళ్ల కొడుకు, ఐదేళ్ల కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ నా పేరు ఆయేషా, భర్త: సయ్యద్ ఖలీద్, ని॥ ఇం.నం. 2-1-156, ప్రగతినగర్, పెద్దపల్లి జిల్లా. నాపేరు ఆయేషా బేగం, భర్త: సయ్యద్ ఖలీద్ గా మార్చబడినది. [K-1246784]

WANTED

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ18k Ph: 9160900024, 9640400073 [SCA-24000547]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253908]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

‘సైబర్’పై సమరం

- ఆర్థిక నేరాలపై అవగాహన సదస్సులు
- 40 రకాలుగా మోసపోతున్నట్లు గ్రహించిన బ్యాంకులు
- చైతన్యం చేసే పనిలో జిల్లా లీడ్ బ్యాంకులు


సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జగిత్యాలజోన్: ఇటీవల చాలామంది సైబర్ మోసాల వలలో చిక్కుకుంటూ ఏళ్ల తరబడి సంపాదించిన డబ్బును కొన్ని సెకన్లలో కోల్పోతున్నారు. దీంతో రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది. ఈ మేరకు కాలేజీలు, బ్యాంకులు ఉన్న చోట అన్ని జిల్లాల లీడ్ బ్యాంకు మేనేజర్లు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నారు. వారానికి రెండుమూడు చొప్పున ఇప్పటి వరకు 76 సదస్సులు నిర్వహించారు. ముఖ్యంగా ప్రజలు 40 రకాలుగా మోసపోతున్నట్లు గ్రహించి ఆ మోసాలను వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారంటే..

- ఈ–మెయిల్ లేదా మెస్సేజ్ ద్వారా మోసపూరితంగా ఒక లింక్ పంపి, అది క్లిక్ చేయగానే వైరస్ ద్వారా మన సమాచారాన్ని దొంగిలిస్తున్నారు.
- తాము ప్రముఖ సంస్థ లేదా ఏదో బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం అంటూ బ్యాంకు అకౌంట్ వివరాలు దొంగిలిస్తున్నారు. ఏటీఎం మిషన్లలో డబ్బులు డ్రా చేయమని అపరిచితులకు కార్డులు ఇవ్వడంతో మోసాలు జరుగుతున్నాయి.
- ఆపదలో ఉన్నామంటూ మెస్సేజ్‌లు పెడుతూ డబ్బులు కొల్లగొడుతున్నారు. లాటరీలో డబ్బులు వచ్చాయని, కొంత పేమెంట్ బ్యాంకులో జమ చేస్తే మిగతా డబ్బులు పంపుతామంటూ మోసం చేస్తున్నారు.
- ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తాం కొంత డబ్బు డిపాజిట్ చేయాలని, క్రెడిట్ కార్డు యాక్టివేట్ చేయాలని, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ బ్యాంకర్లు చేసినట్లు ఫోన్లు చేస్తూ, క్యాష్ బ్యాక్ ఆఫర్ల ప్రకటనలతో, పబ్లిక్ స్థలాల్లో ఉచిత వై ఫై ద్వారా బ్యాంకు అకౌంట్లు, యూజర్ ఐడీ తెలుసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు.
- తెలియని వెబ్‌సైట్లలో ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా, ఇంటి నుంచి పనిచేస్తే లక్షల్లో ఆదాయమంటూ ఆధార్, బ్యాంకు అకౌంట్లు తీసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు మీ బ్యాంకు అకౌంట్లలో వేయాల్సి ఉంది, మీ వివరాలు పంపడి అంటూ బురిడీ కొట్టిస్తున్నారు.
- చైన్ మార్కెటింగ్ స్కీంలు, డిస్కౌంట్లు, ధార్మిక సంస్థల పేరుతో, యాప్స్ ద్వారా అధిక వడ్డీలకు అప్పులు, బెదిరింపులు, డెబిట్, క్రెడిట్ వివరాలను ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా దొంగిలించడం చేస్తున్నారు.

అప్రమత్తతతోనే చెక్

ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉంటేనే ఆర్థిక నేరాలకు చెక్ పెట్టే అవకాశం ఉంది. మనకు తెలియని వారి నుంచి వచ్చే మెస్సేజ్‌లు, లింక్‌లు ఓపెన్ చేయొద్దు. బ్యాంకుల నుంచి ఏ మేనేజర్ కూడా ఏ విషయం గురించి ఖాతాదారుకు ఫోన్ చేయరు. ఆన్‌లైన్ ట్రాన్‌జాక్షన్ చేసేటప్పుడు మొబైల్ నంబర్ సరిచూసుకోవాలి. డబ్బులు మన అకౌంట్లలోకి వచ్చేటప్పుడు ఎవరూ పిన్ అడగరన్న విషయం గుర్తుంచుకోవాలి. మన ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెబితేనే నేరగాళ్లు మన అకౌంట్ల నుంచి డబ్బులు డ్రా చేస్తారు. డబ్బులు విత్‌డ్రా చేయమని ఏటీఎం కార్డును ఎవ్వరికి ఇవ్వొద్దు. ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దు. ఆధార్, సిమ్‌కార్డు వివరాలు ఎవరికీ చెప్పొద్దు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. డబ్బులు ఊరికే ఎవరూ ఇవ్వరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. పూర్తి వివరాలు చదవకుండా ఎక్కడా సంతకం చేయొద్దు. తెలియని వెబ్‌సైట్‌లలో డబ్బు చెల్లించవద్దు.

ఎవరినీ గుడ్డిగా నమ్మొద్దు



మన సొంత విషయాలు అడిగేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఎవరికీ బ్యాంకు అకౌంట్ల వివరాలు చెప్పొద్దు. పిన్ నంబర్‌ను మారుస్తూ ఉండాలి. యాప్‌ల్లో కనిపించే కంపెనీల గురించి తెలుసుకోకుండా డబ్బు పంపించవద్దు.
– రామ్‌కుమార్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, జగిత్యాల

అవగాహన సదస్సులు



ఆర్థిక మోసాలపై సదస్సుల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్నాం. బ్యాంకులు, కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా మోసపోయినట్లు అనుమానం వస్తే 1930 నంబర్‌తో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.
– మధుసూదన్, అవగాహన సదస్సుల ఇన్‌చార్జి, జగిత్యాల

పుత్రభిక్ష పెట్టండి

- కొడుకు కోసం తల్లిదండ్రుల ఆరాటం
- నెలకు వైద్యానికి రూ.2.50 లక్షలు..
- ఇప్పటి వరకు రూ.30 లక్షలు ఖర్చు
- ఆపన్నహస్తం అందించాలని వేడుకోలు


కొడుకును బతికించాలని వేడుకుంటున్న తల్లి

రాయికల్(జగిత్యాల): చేతికందే సమయంలో కొడుకు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎలాగైనా కన్న పేగును దక్కించుకోవాలనే ఆశతో ఆ తల్లిదండ్రులు ఇప్పటి వరకు అందినకాడ అప్పు చేసి సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం చేతిలో డబ్బు లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం మల్లేశ్ దర్జీ పని చేస్తుండగా అతడి భార్య సంధ్య బీడీ కార్మికురాలు. వీరి పెద్ద కొడుకు చరణ్ (22 ఏళ్లు). ఈ ఏడాది ఫిబ్రవరిలో అయోధ్య–కుమ్మరిపల్లి గ్రామాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆపరేషన్ చేసిన అనంతరం హైదరాబాద్‌లోని రిహాబ్ కేర్ సెంటర్‌కు తరలించారు. చరణ్ ఆరోగ్యం మెరుగుపడాలంటే చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రతినెలా సుమారు రూ.2.50 లక్షల ఖర్చవుతోంది. తల్లి అతడి వద్దే ఆస్పత్రిలో ఉంటుండగా తండ్రి దర్జీ పనిచేస్తూ కొడుకును బతికించుకునేందుకు నానా తంటాలు పడుతున్నాడు. మరో 4–5 నెలల వరకు చరణ్‌లో కదలిక వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొనడంతో ఆ పేద తల్లిదండ్రులు తమ కొడుకును ఎలాగైనా బతికించుకోవాలనే ఆశతో ఉన్న ఆస్తులు సైతం అమ్మారు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు స్పందించి ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయడానికి
ఫోన్‌పే నంబర్లు : 99638 08663, 91214 04030

అక్రమ పద్ధతిలో కార్మికుల నియామకాలు


అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో రెండు నెలల క్రితం 10 మంది పారిశుధ్య కార్మికులను మున్సిపల్ కౌన్సిల్‌కు సమాచారం లేకుండా నియమించారని, విచారణ చేపట్టాలని సోమవారం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గౌతంరెడ్డికి వైస్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు వినతిపత్రం అందించారు. అక్రమ పద్ధతిలో నియామకాలు చేశారని తెలిసిందని, అలాంటి కార్మికులకు జీతభత్యాలు ఇవ్వొద్దని, నియామకాలు వెంటనే రద్దు పర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతినెలా డీజిల్ ఖర్చు దాదాపు రూ.8లక్షలకు పైగా ఖర్చు చేయగా.. ప్రస్తుతం ఆరునెలల నుంచి రూ.10 లక్షలకు పైగా వస్తోందని ఫిర్యాదు చేశారు.

బాలుడి కిడ్నాప్ కేసు సుఖాంతం

- తల్లి నుంచి అపహరించి రూ.50 వేలకు అమ్మకం
- ముగ్గురిని రిమాండ్ చేసిన పోలీసులు


నిందితుల అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లో రెండున్నరేళ్ల బాలుడి కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. కిడ్నాప్‌నకు గురైన బాలుడిని తల్లి వద్దకు పోలీసులు చేర్చారు. ఈ కేసులో ముగ్గురిని సోమవారం అరెస్టు చేసి జైలుకు తరలించారు. వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాలు.. గత నెల 27న కామారెడ్డికి చెందిన కరీంనగర్, చాకలివాడలో నివాసముంటున్న షేక్‌లీనా తన రెండున్నరేళ్ల కుమారుడిని కిడ్నాప్ చేశారని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఎస్సై రాజన్న, కానిస్టేబుళ్లు కుమార్, బషీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి బాలుడి ఆచూకీ కోసం గాలించారు. సీసీ ఫుటేజీ, ఇతర టెక్నాలజీ ఆధారంగా నిందితులు కరీంనగర్ చాకలివాడకు చెందిన దాసరి స్వరూప అలియాస్ సరోజ, మోతె కృష్ణ కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. అనంతరం బాలుడిని సాధనవేణి అలియాస్ బొజ్జ లలియా అలియాస్ లత, సాధనవేణి రమేశ్ దంపతులకు రూ.50 వేలకు అమ్మారు. ఈ కేసులో మోతె కృష్ణ పరారీలో ఉన్నాడు. దాసరి స్వరూప అలియాస్ సరోజ, సాధనవేణి లలియా, రమేశ్‌ను జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

కొనుగోళ్లు సజావుగా చేపట్టాలి


పెగడపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న లత

పెగడపల్లి: ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా చేపట్టాలని అదనపు కలెక్టర్ లత తెలిపారు. మండలకేంద్రంలో ప్యాక్స్, అయితిపల్లిలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సోమవారం సందర్శించారు. సరిపడా కాంటాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. మండల అధికారులు ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీసీవో మనోజ్‌కుమార్, డీఎం జితేంద్రప్రసాద్, తహసీల్దార్ రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయికిరణ్, ఏపీఎం సమత, సీఈవో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రాల వద్ద రైతులకు వసతులు కల్పించాలి

మల్లాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని డీసీసీబీ జిల్లా డైరెక్టర్ తక్కల్ల నరేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. నిర్వాహకులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని తెలిపారు. ప్యాక్స్ సీఈవో రమేశ్, వైస్ చైర్మన్ ఆరే రాజేందర్, డైరెక్టర్లు ఏలేటి వెంకటేశ్వర్ రెడ్డి, వాకిటి భూమారెడ్డి, తేలు ముత్యంరెడ్డి, ఉదగిరి లింబాద్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి

జగిత్యాల: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మెప్మా కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సర్వే నిర్వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించి పార్ట్–1, 2లలో 75 ప్రశ్నలతో కూడిన కుటుంబ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ప్రతి కుటుంబంలోని వారితో గౌరవంగా.. హుందాగా వ్యవహరించి సమాధానాలు సేకరించాలన్నారు. ఈ సర్వే ఉద్దేశం ప్రజలకు అవగాహన కల్పించారు. హౌస్ లిస్టింగ్ అంటించిన వెంటనే గోడపై స్టిక్కర్ అంటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మరోసారి ఎల్ఎండీ గేట్లు ఎత్తిన అధికారులు

తిమ్మాపూర్: ఎస్సారెస్పీ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరులోకి నీరు చేరడంతో ఎల్ఎండీ జలాశయం పూర్తిగా నిండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదలాలని అధికారులు నిర్ణయించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు సోమవారం ఎల్ఎండీ రెండు గేట్లు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదలచేశారు. పశువుల కాపరులు, మత్స్యకారులు వాగులోకి వెళ్లొద్దని సూచించారు. నది పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఈ నాగభూషణం సూచించారు.

మూఢ నమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి: మూఢ నమ్మకాలను ప్రజలు నమ్మవద్దని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. పట్టణ శివారులోని అర్బన్ హౌజింగ్ కాలనీలో సోమవారం రాత్రి పోలీస్ కళా బృందాల చేత ప్రజలకు సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవి ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో నగదు, సామగ్రి దగ్ధం

మెట్‌పల్లి: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో జల అనే మహిళ ఇంట్లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సాయంత్రం జల ఇంట్లో దీపం వెలిగించి బయటకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఇంటిలో నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లోని బీరువాతో పాటు అందులో దాచి ఉంచిన రూ.10 వేల నగదు దగ్ధమైందని బాధితురాలు తెలిపింది.

రేషన్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లిరూరల్: ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా మండలంలోని వేంపేట శివారులో సోమవారం రాత్రి సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. నిర్మల్‌కు చెందిన ఎండీ హైదర్ మెట్‌పల్లి ప్రాంతంలో సుమారు 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి తన ఆటోలో తరలిస్తుండగా, సమాచారమందుకున్న సీఐ సిబ్బందితో కలిసి వేంపేట శివారులో పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. హైదర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఖోఖో విజేతలు మానకొండూర్, తిమ్మాపూర్

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం జరిగిన అండర్ –17 విభాగం ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో మానకొండూరు మండలం ప్రథమ, హుజూరాబాద్ మండలం ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో తిమ్మాపూర్ మండలం ప్రథమ, గంగాధర మండలం ద్వితీయస్థానంలో నిలిచాయి. పోటీలకు జిల్లాలోని 16 మండలాల నుంచి 380 మంది బాలబాలికలు హాజరయ్యారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మహేందర్‌రావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. భవిష్యత్తులో విద్య, ఉద్యోగ అవకాశాల్లో క్రీడా రిజర్వేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు డీఈవోపై విచారణ

కరీంనగర్: డీఈవో జనార్దన్‌రావుపై మంగళవారం ఆయన కార్యాలయంలో వరంగల్ ఆర్‌జేడీ బృందం ఉదయం 11 గంటలకు విచారణ జరపనుంది. డీఈవో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని డీటీఎఫ్, యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు గతంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. చిన్న చిన్న కారణాలతో టీచర్లకు మెమోలు ఇవ్వడం, సస్పెండ్ చేయడం, ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్ సమయంలో వందలాది మంది ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయడం, ఉపాధ్యాయ సంఘాల నాయకులను విస్మరించడం, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, డీఈవో విద్యార్హత పత్రాల గోప్యత, సమాచార హక్కు చట్టం కింద కొన్ని విషయాలు అడిగితే స్పందించకపోవడం, సంబంధం లేని విషయాలపై టీచర్లు ఫోన్‌లో సమాధానం ఇవ్వాలనడం.. ఇలా మొత్తం 27 అంశాలను ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాజన్నకు కార్తీక శోభ



వేములవాడఅర్బన్: రాజన్న ఆలయం సోమవారం జనంతో కిక్కిరిసింది. కార్తీక మాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకుని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.







కోటేశ్వరస్వామి సన్నిధిలో..



వెల్గటూర్(ధర్మపురి): కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా కోటిలింగాల కోటేశ్వరస్వామి సన్నిధిలో గంగాహారతి కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలచే దీపోత్సవం కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఉత్సాహంగా గోదావరి నదిలో దీపాలు వదిలారు. దేవాదాయశాఖ పరిశీలకులు రాజమౌళి, ఈవో కాంతారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పదిరె నారాయణరావు, రేగొండ రామన్న, అర్చకులు సంజీవ్, నాగరాజు, శంకరయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఓంకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కొండగట్టులో..

మల్యాల(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో సోమవారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి, భజనలు చేశారు.



హారతి గైకొనుమా..

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో మూడోరోజు సోమవారం సాయంత్రం గంగాహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి గోదావరినదికి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో బయలుదేరి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీశారదా మహిళా మండలి, వాసవీ మహిళా మండలి సభ్యులు, కరీంనగర్‌కు చెందిన తిరుమల సేవా గ్రూప్ సభ్యుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.


గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు